సాక్షి
పెద్దపల్లి

బుధవారం। 23। ఆగస్టు। 2023

థాంక్యూ సార్

జిల్లా ఎమ్మెల్యే అభ్యర్థులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. తమకు టికెట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బొకేలు అందజేశారు. సీఎంను కలిసిన వారిలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత తదితరులు పాల్గొన్నారు.





న్యూస్‌రీల్

ఓటుహక్కు ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలి



ఓటుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

ఫెర్టిలైజర్‌సిటీ: ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ వీర్లపల్లిలో ఈశ్వరకృప వృద్ధాశ్రమం లోని వృద్ధులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ రాని వారి వివరాలు సేకరించారు. త్వరలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వృద్ధులు ఆడుకునేలా వస్తువులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఓటరు అవగాహనలో భాగంగా ఈవీఎం, వీవీప్యాట్ ద్వారా ఓటు వేసే విధానాన్ని వివరించారు. జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, రామగుండం తహసీల్దార్ కుమార్ స్వామి, వృద్ధాశ్రమం నిర్వాహకులు పీటీ.స్వామి, వృద్ధులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పాటించాలి

విద్యార్థులకు ప్రాథమికస్థాయిలో పటిష్టమైన విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ వారి విద్యా ప్రమాణాలపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

లింగనిర్ధారణ చట్ట వ్యతిరేకం

కోల్‌సిటీ(రామగుండం): లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని, పరీక్షలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. గోదావరిఖనిలోని స్కానింగ్ సెంటర్లు, డయాగ్నొస్టిక్స్, మెటర్నిటీ ఆసుపత్రుల్లో మంగళవారం వైద్య సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, చేసిన, చేయించుకున్నవారు శిక్షార్హులని, మూడేళ్లవరకు జైలు శిక్ష, రూ.50వేల జరిమానా విధించే అవకాశముంటుందని పేర్కొన్నారు. నర్సింగ్ హోంలలో గర్భిణుల పూర్తివివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలని సూచించారు. వైద్యాధికారి స్వప్నలత, డిప్యూటీ డెమో ఎస్.వెంకటేశ్వర్లు, డీడీఎం సీహెచ్.మహేందర్, ఏపీడమాలజిస్ట్ జె.నరేశ్ పాల్గొన్నారు.

వీవీప్యాట్‌లపై అవగాహన



పెద్దపల్లిరూరల్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వేసే విధానంపై రాఘవాపూర్‌లో వృద్ధులకు అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అవగాహన కల్పించారు. సీడీపీవో కవిత, తహసీల్దార్ రాజ్‌కుమార్ ఉన్నారు.

అసంతృప్తుల దారెటు!?

- సింహం గుర్తు వైపు నేతల చూపు
- గెలిపించుకుంటున్న ఏఐఎఫ్‌బీ
- పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి
- పెద్దపల్లి బీఆర్‌ఎస్‌లో ఆగని వలసలు

ఆ పార్టీకి జిల్లాలో పెద్ద నాయకత్వమంటూ లేదు. ఆ సంఖ్యలో కార్యకర్తలు కూడా కనిపించరు. జెండాలు, ఎజెండాలు లేవు. అయినప్పటికీ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ప్రధానపార్టీలతో సమానంగా పోటీ ఉంటుంది. పార్టీ గుర్తుపై బరిలో నిలిచేందుకు నేతలు ఆసక్తి చూపుతారు. గతంలో జరిగిన అసెంబ్లీ, మున్సిపల్ ఎన్నికల్లో ఆ గుర్తుపై పోటీచేసిన వారు విజయం సాధించడమే కారణం. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున పోటీచేసే ఎమ్మెల్యే అభ్యర్థులను సీఎం కేసీఆర్ ప్రకటించటంతో ఎమ్మెల్యే ఆశావహులు, అసంతృప్తులు సదరు పార్టీ గుర్తుపై బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆ పార్టే.. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బీ). పార్టీ గుర్తు సింహం. పోటీలో సింహంలా నిలబడి గెలవాలని అభ్యర్థులు ఆరాటపడుతున్నారు.



సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పాతకాపులకే సీట్లు కేటాయించారు. దీంతో ఎమ్మెల్యే ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. కేసీఆర్ సర్వేలు, పనితీరు ఆధారంగానే టికెట్ కేటాయిస్తానని పలు సందర్భాల్లో ప్రకటించిన నేపథ్యంలో ఈసారి సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ కష్టమేనని ఆశావములు భావించారు. అదే సమయంలో ఎన్నికల్లో నిలబడేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే కేసీఆర్ ప్రకటించిన జాబితా మాత్రం వారికి మొండిచేయి చూపింది. స్థానికంగా ఉన్న పరిస్థితులు, సామాజిక వర్గాల ఆధారంగా తమకు టికెట్ లభిస్తుందని, పెద్దల ఆశీస్సులు ఉన్నాయంటూ, ఫౌండేషన్స్, సేవా సంస్థల పేరుతో ప్రజల్లోకి వెళ్లారు. ఎమ్మెల్యేలకు పోటాపోటీగా పాదయాత్రలు, కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో బీఆర్‌ఎస్ టికెట్ రాకపోయిన అసెంబ్లీ బరిలో నిలిచి తాడోపేడో తేల్చుకోవాలని అనుకుంటున్నారు. కుదిరితే ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, లేదా ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు.

బరిలో నిలిచేందుకే మొగ్గు..

పెద్దపల్లి నుంచి దాసరి మనోహర్‌రెడ్డికే మరోసారి బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించటంతో అదే పార్టీకి చెందిన నల్లా మనోహర్‌రెడ్డి రాజీనామా చేశారు. ఎన్నికల్లో ఎలాగైనా పోటీలో ఉంటానని ప్రకటించారు. టికెట్ ఇస్తే బీజేపీ నుంచి.. లేకుంటే ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పోటీచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే బొద్దుల లక్ష్మణ్ బీసీ అభ్యర్థిగా పోటీలో ఉండేందుకు ఆయా సంఘాలతో మంతనాలు సాగిస్తున్నారు. రామగుండం నియోజకవర్గంలోనూ అసంతృప్త నేతలు ఉమ్మడి అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బీజేపీ సీనియర్ నేత కౌశిక హరి కారు ఎక్కేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. దీంతో కౌశిక హరి భార్యను పాలకుర్తి జెడ్పీటీసీగా బరిలో నిలిపి జెడ్పీ చైర్‌పర్సన్ చేస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ఫార్వర్డ్ బ్లాక్ తరఫున లేదా ఓ ప్రధాన పార్టీ తరఫున టికెట్ ఇస్తే పోటీ చేసేందుకు ఓ ముఖ్యనేతతో సంప్రదింపులు సాగిస్తున్నట్లు సమాచారం. మంథని నుంచి టికెట్ ఆశించిన చల్లా నారాయణరెడ్డి జాబితా ప్రకటించిన తరువాత సైలెంట్ అయ్యారు.

బరిలో ఉంటాం

నియోజకవర్గాల్లో ప్రతి ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, నామినేటెడ్ పోస్టుల విషయంలో ఎమ్మెల్యేలను కీలకం చేస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ద్వితీయ శ్రేణి నేతలు ఎదగకుండా పట్టించుకోకపోవడంతో క్యాడర్‌లో కొంత అసంతృప్తి నెలకొంది. ముఖ్యంగా స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలో ఇదే భావన ఉంది. వారందరూ తమకు బహిరంగంగా కాకపోయిన అంతర్గతంగా మద్దతు ఇస్తారనే ఆశతో ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశావహులు పోటీ చేస్తామంటూ అనుచరులకు లీకులు ఇస్తున్నారు.

బల్దియాలో దోమల నివారణ చర్యలు

సాక్షి ఎఫెక్ట్



సిబ్బందితో పిచ్చిమొక్కలను తొలగింపజేస్తున్న కమిషనర్ నాగేశ్వర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలికలో దోమలతో ప్రజలు నరకం చూస్తున్నారంటూ 'బల్దియాకు దోమల బెడద' శీర్షికను ఈ నెల 21న 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి బల్దియా అధికారులు స్పందించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ పారిశుధ్యం లోపించిన ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. అడ్డగుంటపల్లి, శ్రీనగర్‌కాలనీలోని పెట్రోల్ బంక్ సమీపంలో పిచ్చిమొక్కలను సిబ్బందితో తొలగించారు. జీజీహెచ్ ఎదుట నిలిచిన వర్షం నీటిలో ఆయిల్ బాల్స్ వేయించారు. ఇందిరానగర్ కల్లు కాంపౌండ్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు, పిచ్చిమొక్కలను పరిశీలించారు. వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించడంతో సిబ్బంది అప్పటికప్పుడు పనులు చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాం, ఆర్ఐ శంకర్‌రావు పాల్గొన్నారు.

కంటతడి పెట్టిన జెడ్పీటీసీ సంధ్యారాణి



పాలకుర్తి: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తన అనుచరులతో తనపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిస్తూ ఇబ్బందికి గురిచేస్తున్నారని పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి కంటతడి పెట్టారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితాలో తన పేరు లేదని, ఆ బాధతో తన అభిమానులు అఘాయిత్యాలకు పాల్పడే ప్రయత్నం చేస్తున్నారనే సమాచారం మేరకు సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్ట్ చేశానని, దానిపై ఎమ్మెల్యే తన అనుచరులతో 'ఈ సారైనా పోటీ చేస్తావా..? అమ్ముడు పోతావా' అంటూ పోస్టులు పెట్టిస్తూ మానసిక వేదనకు గురిచేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తానని, నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, సహకారం తనకు ఎల్లప్పుడూ ఉండాలని వీడియో విడుదల చేశారు.

పెండింగ్ పనులు రెండురోజుల్లో పూర్తి చేయాలి

పాలకుర్తి: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను రెండురోజుల్లోగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అధికారులను ఆదేశించారు. మండలంలోని కుక్కలగూడూర్, గుడిపల్లి, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణను పరిశీలించారు. సెగ్రిగేషన్ షెడ్లలో చెత్తను వేరుచేయకపోవడంపై అధికారులు, పంచాయతీపాలకవర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి షెడ్లకు తరలించాలని, కంపోస్టు ఎరువు తయారు చేయాలని సూచించారు. డీపీవో చంద్రమౌళి, డీఎల్‌పీఓ వేణుగోపాల్, ఎంపీడీవో లలిత, ఎంపీఓ షబ్బీర్‌పాషా, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, ఉపాధి హామీ ఏపీవో రమేశ్, పంచాయతీరాజ్ ఏఈ, శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు గోండ్ర చంద్రయ్య, కొప్పు పుష్పలత, ముక్కెర రాజకుమారితోపాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్..


'పెద్దపల్లి బైపాస్'కు లైన్ క్లియర్

- చీకురాయి–పెద్దబొంకూరు మధ్య కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణానికి నిర్ణయం
- తొలుత ఎలక్ట్రిక్ లైన్‌కు టెండర్లు పిలిచిన దక్షిణ మధ్య రైల్వే
- భవిష్యత్తులో ముంబై, సికింద్రాబాద్‌కు రైళ్ల సంఖ్య పెరిగే అవకాశం
- ఉమ్మడి కరీంనగర్‌వాసులకు మేలు

సాక్షి ప్రతినిధి,కరీంనగర్: ఎన్నో దశాబ్దాలుగా కరీంనగర్ నుంచి హైదరాబాద్, ముంబై వంటి నగరాలకు రైలులో వెళ్లాలన్న పాత కరీంనగర్ వాసుల కల త్వరలో సాకారం కానుంది. ఇందుకోసం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్–కాజీపేట–బల్లార్షా సెక్షన్‌ను పెద్దపల్లి–కరీంనగర్–ముంబై సెక్షన్ లైన్‌తో కలపనుంది. ఇటీవల పెద్దపల్లి–కరీంనగర్ మార్గాన్ని డబ్లింగ్ లైన్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ముందుకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే తాజాగా.. కాజీపేట–బల్లార్షా, కరీంనగర్–పెద్దపల్లి లైన్లను కలపడం ద్వారా ఈ సెక్షన్‌లోని రైల్వే ప్రయాణంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది.

భూమి ఇచ్చేందుకు రైతుల అంగీకారం

పెద్దపల్లి జిల్లాలోని చీకురాయి–పెద్దబొంకూరు గ్రామాల మధ్య పెద్దపల్లి బైపాస్ పేరుతో కొత్త రైల్వేస్టేషన్ నిర్మించతలపెట్టారు. ఇందుకోసం ఇటీవల రెండు గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. దాదాపు 20 ఎకరాల వరకు భూమిని ఇచ్చేందుకు రైతులు అంగీకరించారు. వారికి పరిహారం ఇచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. రైల్వేస్టేషన్ నిర్మాణంలో భాగంగా ముందుగా ఎలక్ట్రిక్ లైన్ నిర్మించేందుకు ఇటీవల టెండర్లు పిలిచింది. త్వరలోనే స్టేషన్ నిర్మాణం కోసం టెండర్లు పిలవనుంది. చీకురాయి–పెద్దబొంకూరుల



మధ్య పాయింట్‌ను వ్యూహాత్మకంగా ఎంపిక చేశారు. ఇది కాజీపేట–బల్లార్షా లైన్‌తో కరీంనగర్–పెద్దపల్లి లైన్ కలిసే ప్రాంతం. ఇంతకాలం ఒక రైలు కరీంనగర్ మీదుగా కాజీపేట/సికింద్రాబాద్ వైపు వెళ్లాలంటే ముందు పెద్దపల్లి జంక్షన్ చేరాలి. అక్కడ బోగీల ముందు ఉన్న ఇంజిన్ విడిపించుకొని, ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చి కాజీపేట వైపు ఉన్న బోగీలను లింక్ చేసుకొని వెళ్లాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు పెద్దపల్లి బైపాస్ రైల్వేస్టేషన్ పూర్తయితే కాజీపేట వైపు వెళ్లే రైళ్లన్నీ కొత్త స్టేషన్ మీదుగా ఎలాంటి ఇంజిన్ మార్పులు అవసరం లేకుండా సాఫీగా సాగిపోతాయి. జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్‌వాసులకు కాజీపేట/వరంగల్/సికింద్రాబాద్ వైపు ప్రయాణం మరింత సులువు కానుంది.

గణనీయంగా పెరిగిన ఫ్రీక్వెన్సీ

కరోనాకు ముందు ఇది కేవలం సింగిల్ లైన్ మార్గం. నిజామాబాద్ వరకు కనెక్టివిటీ ఉండటం, ఈ మార్గాన్ని వందే భారత్ వంటి రైళ్లు సైతం నడిచేలా ఇటీవల 100 కి.మీ. వేగం తట్టుకునేలా ట్రాక్ సామర్థ్యం పెంచారు. గతంలో ఖాజీపేట–బల్లార్షా సెక్షన్‌లోని రైళ్లు సికింద్రాబాద్ మీదుగా మహారాష్ట్ర వెళ్లేవి. దీనివల్ల చాలా ఇంధనం, సమయం వృథా అయ్యేవి. ఈ మార్గం పూర్తి కావడంతో కరోనా కాలంలో పెద్దపల్లి–నిజామాబాద్ రూట్‌కు డిమాండ్ బాగా పెరిగింది. ప్రతీరోజు గ్రానైట్, బొగ్గు, బాయిల్డ్ రైస్, వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసే రైళ్ల ఫ్రీక్వెన్సీ గతంలో ఎన్నడూ లేనంతగా గణనీయంగా పెరిగింది. ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సరుకు రవాణా రైళ్ల ద్వారా అత్యధికంగా ఆదాయం తీసుకువచ్చే రైల్వే మార్గాల్లో పెద్దపల్లి–నిజామాబాద్ ఒకటిగా ఆవిర్భవించింది.

చెప్పుకోదగ్గ రైళ్లేవీ లేవు

కానీ, ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లు మాత్రం చెప్పుకోదగ్గవి ఏమీలేవు. ఢిల్లీ, కోల్‌కతా, విశాఖపట్టణం, వారణాసి, బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం నగరాలకు రైళ్లు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మార్గంలో కేవలం రెండు పుష్‌పుల్ (డెమూ, మెమూ) ఎక్స్‌ప్రెస్ రైళ్లు, కాజీపేట నుంచి దాదర్ ముంబై వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్, తిరుపతి నుంచి కరీంనగర్ బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ మార్గంలో కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ లాంటి ఎక్కువ జనాభా కలిగిన పట్టణాలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో డబ్లింగ్ పూర్తయితే ఇటు ముంబై వైపు, అటు సికింద్రాబాద్ వైపు రైళ్ల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. మరోవైపు అటల్ మిషన్ ఫర్ రిజునవేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంఆర్‌యూటీ) పథకం కింద ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌కు రూ.26.6 కోట్లు, రామగుండంకు రూ.26.50 కోట్లు, పెద్దపల్లికి రూ.20 కోట్లు మంజూరయ్యాయి. అయితే, ఈ పనులను రెండు దఫాల్లో చేపట్టనున్న కేంద్రం.. తొలిదశలో కరీంనగర్, రామగుండం స్టేషన్లను అభివృద్ధి చేసి, మరికొన్ని నెలల్లోనే పెద్దపల్లిలోనూ పనులు ప్రారంభించనుంది.

ఉమ్మడి జిల్లా ప్రజలకు ఉపయుక్తం

చీకురాయి వద్ద రైల్వేస్టేషన్ నిర్మించతలపెట్టడం అభినందనీయం. రెండు మార్గాలు కలిసేచోట స్టేషన్ నిర్మించడం వల్ల మా ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇది ఒక్క పెద్దపల్లి ప్రజలకే కాకుండా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

– మేకల శ్రీనివాస్, చీకురాయి

పార్టీయే బలం.. ప్రజలే బలగం

పార్టీ మా బలం.. నియోజకవర్గ ప్రజలే బలగం అంటున్నారు ఉమ్మడి జిలా ఎమ్మెల్యేలు.. వచ్చే ఎన్నికల్లో పోటీచేసే బీఆర్‌ఎస్ అభ్యర్థులు. సీఎం కేసీఆర్ మమ్మల్ని అభ్యర్థులుగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఇంతవరకు ఎంతో అభివృద్ధి చేశామని.. మరిన్ని పనులు చేసేందుకు ప్రజలు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ కార్యకర్తలు.. ప్రజల సహకారంతో విజయ బావుటా ఎగురవేస్తామన్నారు. అందరితో కలిసికట్టుగా పనిచేస్తూ తిరుగులేని గులాబీ సైన్యంగా ముందుకు సాగుతామని.. వచ్చేది తమదే సర్'కారు' అని పేర్కొన్నారు. ఇంకా వారేమన్నారో వారి మాటల్లోనే...

ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తా



సిరిసిల్ల: సీఎం కేసీఆర్ నన్ను సిరిసిల్ల అభ్యర్థిగా ప్రకటించినందుకు ధన్యవాదాలు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తాం. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా. 2009 నుంచి సిరిసిల్ల ప్రజలు నన్ను నాలుగు సార్లు గెలిపించారు. వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. నియోజకవర్గ ప్రజల దీవెనలతో భారీ మెజార్టీతో గెలుస్తా. – కేటీఆర్, మంత్రి

అభివృద్ధే ధ్యేయం



వేములవాడ: రాజన్న గుడి, వేములవాడ మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు పనిచేసిన రమేశ్‌బాబు నాయకత్వంలో భారీ మెజార్టీతో గెలుస్తాను. బీఆర్‌ఎస్ పార్టీలో వర్గపోరు లేదు. మేమంతా ఒకే కుటుంబం.


– చల్మెడ లక్ష్మీనరసింహారావు

మేనిఫెస్టోలో లేని పనులు చేశా..



కరీంనగర్: కరీంనగర్‌ను పదేళ్లల్లో వేలకోట్లతో అభివృద్ధి చేశాను. సీఎం కేసీఆర్‌కు కరీంనగర్‌పై ప్రత్యేక అభిమానంతో నిధులు కేటాయిస్తున్నారు. రూ.180 కోట్లతో తీగలవంతెన, రూ.410 కోట్లతో రివర్‌ఫ్రంట్ పనులు సాగుతున్నాయి. ఐటీటవర్, మెడికల్ కాలేజీ తదితరాలు పూర్తయ్యాయి. మేనిఫెస్టోలో లేని పనులు చేసి చూపించా. నాలుగోసారి విజయ బావుటా ఎగురవేస్తా.. –గంగుల కమలాకర్, మంత్రి

ప్రజారుణం తీర్చుకుంటా



మానకొండూరు: మూడోసారి భారీ మెజార్టీతో గెలిచి ప్రజలరుణం తీర్చుకుంటా. సీఎం కేసీఆర్ నాపై నమ్మకంతో రెండుసార్లు మానకొండూరు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చారు. అందరి సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేశాను. టిక్కెట్ ఇచ్చిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. – రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే

కేసీఆరే దైవం



చొప్పదండి: కేసీఆర్ దైవసమానులు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. కార్యకర్తలే నా బలం, బలగం. గత ఎన్నికల్లో 42 వేల మెజారిటీతో గెలిపించారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని మరో కోనసీమగా చేశా..రూ. 150 కోట్లతో కొండగట్టు అభివృద్ధి జరుగుతోంది.

– సుంకె రవిశంకర్, ఎమ్మెల్యే

ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే..



హుజూరాబాద్: హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గడిచిన రెండేళ్లలో నియోజకవర్గంలో తట్టెడు మట్టి కూడా పోయలేదు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఊహించనిస్థాయిలో అభివృద్ధి జరిగింది. ఈసారి ఇక్కడ ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే. మరోసారి కేసీఆర్ సీఎం కాబోతున్నారు. నన్ను గెలిపిస్తే రూ.వెయ్యికోట్లతో అభివృద్ధి పనులు చేస్తా. –పాడికౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ

'హ్యాట్రిక్' సాధిస్తా..



హుస్నాబాద్ ప్రజలు రెండు సార్లు ఆశీర్వదించారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశా. సీఎం కేసీఆర్ మరోసారి టికెట్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ప్రజలు ఎంతో సహకరించారు. అదేస్ఫూర్తితో హ్యాట్రిక్ విజయం సాధిస్తాను.

– వొడితెల సతీశ్‌కుమార్,ఎమ్మెల్యే

అన్ని రంగాల్లో అగ్రస్థానం



గోదావరిఖని: రామగుండాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యం. గడిచిన నాలుగున్నరేళ్లలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కృషిచేశా. గోదావరిఖనిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు, విలీన గ్రామాలకు విముక్తి కల్పించాను. సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయను. –కోరుకంటి చందర్,ఎమ్మెల్యే

సంక్షేమం.. సామాజిక సేవ



మంథని: మంథనిని 40ఏళ్లు పాలించిన దుద్దిళ్ల కుటుంబం పేదవాడికి చెంచడు నీళ్లు పోయలేదు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలను అర్హులైన పేదవారికి చేరవేస్తున్నా. పేద కుటుంబంలో పుట్టిన తనపై నియోజకవర్గ ప్రజల అభిమానం, ఆశీస్సులు ఉన్నాయి. మరోసారి విజయం సాధిస్తా. – పుట్ట మధు

పెద్దపల్లికి గుర్తింపు తెస్తా



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలుపుతా. ఇప్పటికే స్వచ్ఛసర్వేక్షణ్, హరితహారంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. పెద్దపల్లి– కూనారం రోడ్డులో రైల్వేవంతెన పనులు పురోగతిలో ఉన్నాయి.

– దాసరి మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే

కేసీఆర్ నాయకత్వంలో..



గొల్లపల్లి: కేసీఆర్ నాయకత్వంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది. ప్రజలకు ఎంతో సేవచేశాను. ఇప్పుడు మరో అవకాశం ఇచ్చారు. ఈసారి కూడా ప్రజల ఆశీర్వాదాన్ని కోరుతున్నా. ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి అన్నిరకాలుగా అండగా ఉంటా.

– కొప్పుల ఈశ్వర్, మంత్రి

సమస్యలు పరిష్కరిస్తా..



జగిత్యాల: అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తా. ఇప్పటికే జగిత్యాలలో మెడికల్ కాలేజీ, మున్సిపాలిటీ సుందరీకరణ, రోడ్డు వెడల్పు పనులకు కృషి చేశాను. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటాను.

– సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే

నాన్నే స్ఫూర్తి..



కోరుట్ల: నాలుగు సార్లు ఎమ్మెల్యేగా కోరుట్ల అభివృద్ధికి కృషిచేసిన నాన్న విద్యాసాగర్ రావు స్ఫూర్తి. యువకుడిగా, వైద్యుడిగా నియోజకవర్గ అభివృద్ధిపై ప్రణాళికతో ముందుకెళ్తా. ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తా. నాన్న చేసిన అభివృద్ధి పనులు నా గెలుపునకు దోహదపడతాయి.

– డాక్టర్ సంజయ్

క్లుప్తంగా

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య


సంతోష్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని కొంతంవాడ(ప్రగతినగర్)కు చెందిన కొంతం సంతోష్(39) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి కథనం ప్రకారం.. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న సంతోష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై, మంగళవారం పెద్దపల్లి శివారులోని రైల్వే వంతెన వద్ద గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. సంతోష్ భార్య సుమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఆలయాల్లో చోరీ

ధర్మారం: మండలంలోని నందిమేడారం హనుమాన్ ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు పడి, హుండీలోని దాదాపు రూ.6 వేలు చోరీ చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని గర్భగుడి తలుపులు పగులగొట్టి, హుండీలోని డబ్బులు ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బొంకూరి రాజమల్లు మంగళవారం ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారులోని పెద్దమ్మనగర్ పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి పుస్తెలు సహా ఇతర బంగారు ఆభరణాలు(దాదాపు రెండు తులాలు) ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్ల గ్రామ శివాలయంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. అమ్మవారి మెడలోని పచ్చల హారం, రెండు జతల పుస్తెలు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఆలయ పూజారి సాంబమూర్తి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి బలవన్మరణం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన కొంతం సాయితేజ(23) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సాయితేజ మద్యానికి బానిసయ్యాడు. ఆ మత్తులోనే మంగళవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రూ.20 లక్షలతో పరారైన హమాలీ లీడర్?

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో లోడింగ్ విభాగానికి చెందిన పాత హమాలీలు 120 మంది వద్ద సబ్ కాంట్రాక్టర్ రూ.20 లక్షలు వసూలు చేశాడు. ఆ మొత్తాన్ని ఆదివారం హమాలీ లీడర్లు పల్లెర్ల హరీశ్, అనంతుల రవీందర్‌లకు ఇచ్చాడు. అదేరోజు రాత్రి వారు ఎల్కలపల్లి గేట్‌లోని ఒక రూంలో బస చేశారు. సోమవారం ఉదయం లేచి చూసేసరికి హరీశ్(కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కిష్టంపేటవాసి) రూ.20 లక్షలతో పరారైనట్లు రవీందర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై జీవన్ తెలిపారు.

గులాబీ జెండా ఎగరేయాల్సిందే..

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- ఘన స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు


గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సర్వమత ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు ముందుకు సాగాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. మంగళవారం రాత్రి గోదావరిఖనికి చేరుకున్న ఆయనకు గులాబీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. మున్సిపల్ ఆఫీస్ ముందున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ప్రధాన చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొన్నారు. ముందుగా సర్వమత ప్రార్థనలు చేశారు. నాలుగున్నరేళ్లలో తాను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయన్నారు. మరో మూడు నెలలు కష్టపడితే గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామన్నారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల ఘన స్వాగతం

జ్యోతినగర్: కోరుకంటి చందర్‌కు ఎన్టీపీసీ రామగుండం రాజీవ్ రహదారి మేడిపల్లి సెంటర్, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. తమ బలం, బలగం అంతా చందర్ అని, ఆయనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

రామగుండంలో..

రామగుండం: సీఎం కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థుల్లో కోరుకంటి ఉండడం.. ఆయన హైదరాబాద్ నుంచి రామగుండం రావడంతో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. రామగుండం బైపాస్ వద్ద మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

టోల్‌ప్లాజా వద్ద..

పాలకుర్తి: కన్నాల టోల్‌ప్లాజా వద్ద పాలకుర్తి, అంతర్గాం మండలాల పార్టీ నాయకులు స్వాగతం పలికారు. పేదల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ రుణం తీర్చుకునేందుకు మరోసారి గెలిపించుకోవాలని సూచించారు.

టీబీజీకేఎస్ నాయకుల బైక్ ర్యాలీ..

యైటింక్లయిన్‌కాలనీ: కోరుకంటి చందర్‌కు స్వాగతం పలికేందుకు ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ నుంచి టీబీజీకేఎస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అధికారుల నిర్వాకం.. రోగులకు శాపం

- సమాచారం ఇవ్వకుండా డయాలసిస్ ఫర్నిచర్ తరలింపు
- నిలిచిన సేవలు.. బంధువుల ఆందోళన
- వెంటనే పునరుద్ధరించిన సిబ్బంది


బెడ్స్‌ను తరలిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డయాలసిస్ సెంటర్‌లో సేవలు చాలాసేపు నిలిచిపోయాయి. సమాచారం లేకుండా ఫర్నిచర్ వేరే ప్రాంతానికి తరలించడంతో రోగులు, వారి బంధువులు ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి మొదటి అంతస్తులో ఉన్న డయాలసిస్ కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, గ్రౌండ్ ఫ్లోర్‌కు తరలించాలని కొంతకాలంగా రోగులు కోరుతున్నారు. అయితే పేషెంట్లకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆదేశించారంటూ.. మూడు బెడ్లతోపాటు ఫర్నిచర్‌ను సిబ్బంది గ్రౌండ్ ఫ్లోర్‌కు తరలించారు. దీంతో డయాలసిస్ సేవలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పేషెంట్లు, బంధువులు ప్రశ్నించడంతో సేవలను తిరిగి పునరుద్ధరించారు.

అయోమయం.. ఆందోళన

ఓ వైపు బెడ్లపై పేషెంట్లకు డయాలసిస్ ప్రక్రియ జరుగుతున్న క్రమంలోనే.. పక్కనే ఉన్న మూడు బెడ్లు, ఫర్నిచర్‌ను సిబ్బంది హడావుడిగా తరలించడం విమర్శలకు తావిచ్చింది. డయాలసిస్ కోసం వచ్చినవారు ఏం జరుగుతోందో అర్థంకాక అయోమయం, ఆందోళనకు గురయ్యారు.

అరసం జాతీయ కార్యదర్శిగా నారాయణ


నారాయణ

గోదావరిఖని: ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగిన మహాసభల్లో అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జాతీయ కార్యదర్శిగా వేల్పుల నారాయణ ఎన్నికయ్యారు. గోదావరిఖనికి చెందిన ఆయన 1982 నుంచి సంఘంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. పలుమార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, అనంతరం తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. నారాయణ కవి, రచయిత, విమర్శకుడు. అనేక పుస్తకాలు ప్రచురించారు. పలు పురస్కారాలు పొందారు. పలువురు రచయితలు ఆయనకు అభినందనలు తెలిపారు.

టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

రామగుండం: టీచర్ల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని, వేతన కమిటీ వేసి, ఐఆర్ ప్రకటించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ బయ్యపు సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రామగుండం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. ప్రతీ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కిరణ్, మండల ప్రతినిధులు ప్రతాప్‌చారి, రమేశ్, వహీద్‌ఖాన్, లక్ష్మణ్, శాస్త్రి, కనకయ్య తదితరులున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి


మాట్లాడుతున్న శంకర్

జ్యోతినగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు మానుకొని, కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని కాంట్రాక్టు కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లాభాలతో నడుస్తున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను బడా పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. కార్మికులు తమ ప్రాణత్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రం 4 కోడ్‌లుగా విభజించి, వారిని కట్టు బానిసలుగా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు బొగ్గు పరిశ్రమ తరహా ప్రత్యేక వేతనాలు అమలు చేయాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 29న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్, నాయకులు బుచ్చయ్య, రాయమల్లు, రాజేశం, సరోజన, రాయమల్లమ్మ, గుండు రాజన్న, కుమార్, సుధాకర్, దుర్గం రవీందర్ పాల్గొన్నారు.

టైరు పేలి వాహనాలను ఢీకొన్న టిప్పర్

- ఇద్దరికి గాయాలు


దెబ్బతిన్న వాహనాల ముందుభాగం

జ్యోతినగర్: టైరు పేలడంతో ఓ టిప్పర్ అవతలి రోడ్డుపై వెళ్తున్న మూడు వాహనాలను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ సమీపంలోని రాజీవ్ రహదారిపై మంగళవారం పెద్దపల్లి నుంచి కంకర లోడ్‌తో వస్తున్న టిప్పర్ టైరు పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి, రామగుండం వైపు వెళ్లే రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్, ట్రాలీఆటోతోపాటు మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీఆటో డ్రైవర్ అజాషా వాహనంలోనే ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న ఎన్టీపీసీ ఎస్సై జీవన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై వాహనాలను ఆపేసి, అజాషాను బయటకు తీశారు. అతనితోపాటు గాయపడిన మరో వ్యక్తిని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఎన్టీపీసీ పోలీసులతోపాటు ట్రాఫిక్ పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు.

అంతర్జాతీయ పరుగు పందెం పోటీలకు ఎంపిక


రాధ

యైటింక్లయిన్‌కాలనీ: అంతర్జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి కాంటివాడ బుగ్గాజి సతీమణి రాధ ఎంపికైంది. ఇటీవల హరియాణా రాష్ట్రంలోని కురుక్షేత్రంలో నిర్వహించిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, బంగారు, కాంస్య పతకాలు సాధించింది. మలేషియాలో సెప్టెంబర్ 16, 17 తేదీల్లో 35వ మలేషియన్ ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరగనున్నాయి. రాష్ట్రం నుంచి భారత్ టీంలో 45 ప్లస్ మహిళల విభాగంలో 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్, ఇండియా సెక్రటరీ జనరల్ రాంపాల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

గోపాల్‌రావుపేటలో సింగరేణి అధికారుల పర్యటన


పరిశీలిస్తున్న అధికారులు

ధర్మారం: మండలంలోని గోపాల్‌రావుపేటలో ఆర్జీ–1 సింగరేణి ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం పర్యటించారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు ఆయన పీఏ వామన్‌రావుతో కలిసి గ్రామానికి వచ్చారు. గ్రామ శివారులోని శ్మశానవాటికకు వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మించేందుకు ఒర్రెను, సాయంపేట పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోపాల్‌రావుపేట వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు, నందిమేడారం–గోపాల్‌రావుపేట మధ్య పాత లింక్‌రోడ్డును పరిశీలించారు. గ్రామస్తులకు ఈ పనులు తప్పనిసరి అని అధికారులు గుర్తించినట్లు సర్పంచ్ జనగామ అంజయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జనగామ లక్ష్మిరాజయ్య, ఉపసర్పంచ్ సంకసాని సంతోష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సందన వేని కొమురయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ భరత్ స్వామి, పంజాల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సంచార వైద్యసేవలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దపల్లిరూరల్: వృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ కావేటి రాజగోపాల్ అన్నారు. జిల్లాకేంద్రంలో వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులకు వైద్యసేవలు అందించే కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్ ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్, సీనియర్ సిటిజన్స్‌కు ఇంటివద్దకు వెళ్లి వైద్య సేవలందించేందుకు సంచార వాహనం ఏర్పాటు చేశామన్నారు. ఈ సంచార వాహనం ద్వారా వయోవృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలను డాక్టర్ రోహిత్, డాక్టర్ మమత, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ అశోక్ పరీక్షలు, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, క్లబ్ సెక్రటరీ సాదుల వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీకాంత్, డీవీఎస్.మూర్తి, సభ్యులు అనిల్, కుమారస్వామి, జీవన్ రాజు ఉన్నారు.

50 మంది ఓటర్లకో ఇన్‌చార్జి


సుల్తానాబాద్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

- గెలుపే లక్ష్యంగా పని చేయండి
- సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ నంబర్ వన్
- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

సుల్తానాబాద్: రానున్న ఎన్నికల్లో 50 మంది ఓటర్లకు ఒకరు ఇన్‌చార్జిగా వ్యవహరించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల అసమ్మతివాదులను పార్టీలోకి తీసుకురావాలని సూచించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ పథకాన్ని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. నిరంతరం విద్యుత్, సాగునీటి సరఫరా చేస్తున్నామని, గ్రామాలన్నీ సుందరంగా తీర్చిదిద్దబడ్డాయని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా, రైతుబంధు, బీసీలకు ఆర్థిక సాయం, మైనార్టీలకు రుణాలు, గృహలక్ష్మి వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, రైతు సంఘం జిల్లా కన్వీనర్ కాసర్ల అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, పార్టీ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్ రావు, రైతు సమితి మండల కో–ఆర్డినేటర్ బోయిని రాజమల్లయ్య, సింగిల్ విండో చైర్మన్లు జూపల్లి సందీప్‌రావు, కోట వీణ, మాజీ ఎంపీపీ పాల రామారావు, కన్వీనర్లు దీకొండ భూమేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసమ్మతివాదులతో సమావేశం

అనంతరం ఎమ్మెల్యే అసమ్మతి కౌన్సిలర్లతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశమయ్యారు. బీసీలకు ఆర్థికసాయం ఎంపికలో తమ మద్దతుదారులకు అవకాశం రాలేదని కొందరు సమావేశమైన విషయం తెల్సిందే. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత భర్త రమేశ్ తమ మద్దతుదారులకు అవకాశం రాకుండా చేస్తున్నారని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పనుల విషయంలో నేరుగా తనను కలవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి నిధులు

- ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు


పనులు ప్రారంభిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమానికి వెనుకాడదని, అవసరమైన నిధులు కేటాయిస్తుందని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం సెంటనరీకాలనీ పబ్లిక్ పార్కులో రూ.8.06 లక్షలతో నూతనంగా నిర్మించనున్న మరుగుదొడ్లు, రూ.2.52 లక్షలతో ఓపెన్ స్టేజీ పనులకు భూమిపూజ చేసి, ప్రారంభించారు. యాజమాన్యం బొగ్గు ఉత్పత్తితోపాటు ఉద్యోగుల రక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కాలనీవాసులు, పరిసర ప్రాంత ప్రజలు పార్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీవైపీఎం రవీందర్ రెడ్డి, సివిల్ డీజీఎం పద్మరాజు, సీనియర్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, డీవైపీఎం శ్రీహరి, సివిల్ డీవైఎస్ రామకృష్ణ, అధికారుల సంఘం ప్రతినిధి టి.నాగేశ్వర్‌రావు, వివిధ సంఘాల నాయకులు గౌతం శంకరయ్య, ఎంఆర్‌సీ రెడ్డి, మధునయ్య, మామిడి స్వామి పాల్గొన్నారు.

పర్యావరణం కలుషితం కాకుండా చూడాలి

గోదావరిఖని: పర్యావరణం కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం ఓసీపీ–1 సీహెచ్‌పీలో రూ.63.53 లక్షలతో నిర్మించనున్న విండ్ బ్యారియర్‌కు భూమిపూజ చేశారు. గని రెమిడేషన్ ప్లాన్‌లో భాగంగా విండ్ బ్యారియర్ నిర్మిస్తున్నామని తెలిపారు. సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణా చేసే సమయంలో వచ్చే దుమ్ము, ధూళిని అరికట్టడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యావరణం దెబ్బ తినకుండా ఉంటుందని చెప్పారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారుల సంఘం ప్రతినిధి నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఇంజినీర్ ఆర్.శ్రీనివాస్, మేనేజర్ ఉదయ్‌హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉద్యోగుల హెల్త్ కార్డులపై ప్రకటన


మాట్లాడుతున్న సురేశ్

సుల్తానాబాద్: ఉద్యోగులకు హెల్త్ కార్డులతోపాటు పీఆర్సీ, ఐఆర్‌లపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రకటన రానుందని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్‌లో సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి సంబంధించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని, పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో నూతన హెచ్‌ఆర్‌ఏ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక పాఠశాలలకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని, పండిట్, పీఈటీలు, కేజీబీవీ, మోడల్, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, 317 జీవో ద్వారా నష్టపోయిన టీచర్లను తమ సొంత జిల్లాకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు మిట్టపల్లి యుగంధర్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్, రాష్ట్ర నాయకులు పెద్దపల్లి లచ్చన్న, రఘునందన్, పిట్టల రవీందర్, రాజేంద్రప్రసాద్, పులి శ్రీనివాస్ రెడ్డి, కుమారస్వామి, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు’

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఎస్‌సీసీడబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకన్న ఆరోపించారు. మంగళవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రామగుండం రీజియన్ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. పర్మినెంట్ చేయకుండా, జీవో ప్రకారం వేతనాలు పెంచకుండా ప్రభుత్వాలు, సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 11వ వేతన ఒప్పందం ప్రకారం వెంటనే హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్, జిల్లా అధ్యక్షుడు నరేశ్, నాయకులు మొగిలి, బుచ్చమ్మ, పద్మ, రమేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై లాఠీచార్జి హేయమైన చర్య


నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం అమలు కోసం గతేడాది శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్మికులపై ఎన్టీపీసీ సంస్థ సీఐఎస్ఎఫ్ సిబ్బంది లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు అన్నారు. ఈ ఘటనకు నిరసనగా ఏటా బ్లాక్ డేగా పాటించాలని నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి, ప్రాజెక్టు రోడ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. సంస్థ కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు నాంసాని శంకర్, చిలుక శంకర్, ఇజ్జగిరి భూమయ్య, రాధారపు రాజమల్లయ్య, లక్ష్మణ్, ఎం.శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, నాగభూషణం, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇ.నరేశ్ డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 21 నుంచి 27 వరకు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత వాల్ పోస్టర్‌ను మంగళవారం గోదావరిఖనిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.దుర్గయ్య, తిప్పని రాంకీ, మర్రి శ్రావణ్, శివకుమార్, పయ్యావుల శ్రీకాంత్, మల్లేశం, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.